మదనపల్లెలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో శనివారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలు దంచికొట్టగా మధ్యాహ్నం 12 గంటల తర్వాత అనూహ్యంగా వాతావరణంలో మార్పు వచ్చింది. వాతావరణం చల్లబడి, మబ్బులు కమ్మి చిరుజల్లులతో మొదలై ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల రోజులుగా భానుడి భగభగలు, పెరిగిన ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోంచి బయటకు రావాలంటేనే భయపడ్డారు. మోస్తరు వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. పిడుగులు, వడగల్లు పడే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలంటూ వాతావరణ, తుపాను హెచ్చరికల శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూ మెసేజ్ రూపంలో హెచ్చరిస్తున్నారు. చాలా రోజుల తర్వాత కొద్దిపాటి వర్షం కురవడంతో పట్టణ ప్రజలు వరి, టమోటా పంటలు సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

- డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి- రాయచోటి

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 3 నుంచి రాయచోటిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే పదవ తరగతి మూల్యంకన కేంద్రంలో వసతులు కల్పించాలని, సమస్యలున్న ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యంకు యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మంచినీటి వసతితోపాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మూల్యాంకన విధులకు 58 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులను, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. మానసిక వైకల్యం గల పిల్లల తల్లిదండ్రులను, జిల్లా కేంద్రం నుండి సుదూర మండలాల ఉపాధ్యాయులు వారి విల్లింగ్ మేరకు మూల్యాంకల విధుల్లో నియమించాలని లేదంటే ఆయా మండలాల ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వాలని కోరారు. మూల్యాంకన విధులు నిర్వహించిన వారికి జాప్యం లేకుండా పారితోషికాన్ని చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 2023-24 మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు రావాల్సిన టిఎ, డిఎ, రెమ్యూనరేషన్ బకాయిలు కూడా చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పందించిన డిఇఒ మూల్యాంకన కేంద్రంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. మూల్యాంకన విధుల పారితోషికాన్ని వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

త్వరలో జిల్లా కేంద్రం కల సాకారం

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

త్వరలోనే మదనపల్లె ప్రజల ఆకాంక్ష నెరవేరుతూ మదనపల్లె జిల్లా సాకారమవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ 26 రోజుల పాటు జరిగిన శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, విద్య, ముస్లిం మైనార్టీల సమస్యల పైన సమగ్రంగా మాట్లాడేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్ తమకు అవకాశం కల్పించారన్నారు. మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పూర్తి బాధ్యతతో పని చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా రోడ్లు విస్తరణ చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. స్విమ్స్, రుయా తర్వాత మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రికే రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున మెరుగైన వైద్యం అందేలా ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దేశానికి జాతీయగీతాన్ని అందించడమే కాకుండా లక్షలాది మందిని విద్యా వంతులుగా తీర్చి దిద్దిన దివ్యజ్ఞాన కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. నియోజకవర్గంలో నిమ్మనపల్లి-రామసముద్రం మండలాలకు రోడ్లు విస్తరణ, టొమోటో ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు, మదనపల్లి పరిసరాల్లో వంద ఎకరాల్లో ఐటి హబ్ ఏర్పాటుకు భూమిని సేకరించి ఎంఎస్‌ఎంఇ కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణం, పరిసరాల్లో డికెటి భూములు కాపాడేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరామన్నారు. కోళ్లబైలు కాలనీలో సుమారు 5 వేల కుటుంబాలు నివాసం ముంటున్నారని, వారికి రోడ్లు, తాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఎన్‌ఆర్‌ఇజిఎస్ క్రింద రూ.12 కోట్లతో రోడ్లు వేశామని, మరో రూ.10 కోట్లతో రోడ్లు నిర్మాణానికి ప్రతి పాదనలు పెట్టడం జరిగిందన్నారు. మైనార్టీల వక్ఫ్ ఆస్తులను, ఎండో మెంట్ ఆస్తులను అన్యాక్రాంత్రం చేస్తే పిడి యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయడం జరుగు తుందని హెచ్చరించారు. మున్సిపాల్టీలలో ఈ నెలాఖరకు సిఎఫ్ఎంఎస్‌కు ప్రభుత్వం స్వస్తి పలుకుతోందని వివరించారు. నియోజకవర్గంలో గడిచిన 10 ఏళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కు వెళ్లిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మదనపల్లెకు మహర్దశ వస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్, బాలు స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్ళుగా ముందుకు తీసు కెళ్తోందని స్పష్టం చేశారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సూపర్ సిక్స్ పథకాలను విడతల వారీగా అమలు చేస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటిఎం మాజీ సర్పంచ్ రెడ్డిరాంప్రసాద్, నాయకులు ముసలికుంట నాగయ్య, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, రెడ్డన్న, రామకృష్ణ, లక్ష్మన్న, శ్రీనివాసులు నాయుడు, ప్రభాకర్, బాబు నాయుడు, మురళి, ఖాసీం, చెంద్రాయుడు, బెల్లె రెడ్డిప్రసాద్, దుబ్బిగాళ్ల భాస్కర్, జంగాల వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి

- మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్

మాట్లాడుతున్న మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. శనివారం అన్నమాచార్య యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మార్గదర్శకత్వంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సో, ఐపిసి, బిఎన్ఎస్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేరాలు, అవినీతి వంటి అక్రమ చర్యల నుండి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. నైతిక విలువలతో కూడిన జీవితం గడపాలని సూచించారు. విద్యార్థులు చట్టాలను గౌరవించి సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని తెలిపారు. 2012లో పోక్సో చట్టం రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడడం, వేధింపులు, పోర్నోగ్రఫీ వంటి నేరాలు నుండి రక్షించేందుకే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం అని జడ్జి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాయి బాబా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, చట్టపరమైన బాధ్యతలపై ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవి.నారాయణ, డీన్ ఎం.సుబ్బారెడ్డి, అన్ని శాఖల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిది, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, జూనియర్ విద్యార్థులకు సెకండ్ ఇయర్ సిలబస్ పేరుతో విద్యార్థులను తరగతులు నిర్వహించడం పూర్తిగా ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిస్థితి ప్రయివేటు విద్యాసంస్థల్లో నెలకొందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కృష్ణప్ప దృష్టికి సమాచారం తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రయివేటు జూనియర్ కళాశాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకునే పరిస్థితి ఎక్కడ లేదని విమర్శించారు. రాజంపే సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐగా డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమీర్, ప్రేమ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయబాబు

మాట్లాడుతున్న మంజునాథరెడ్డి

'ఆదిత్య'లో కృత్రిమ మేధస్సుపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో ప్రోటోటైప్, ప్రాసెస్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, సిఎస్‌సి (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), ఎఐడిఎస్ నుండి ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ ఆటోమేషన్, ఆవిష్కరణలపై దృష్టి సారించి, ప్రోటోటైప్‌లు, ప్రక్రియలను రూపొందించడంలో అభివృద్ధి చేయడంలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. సిట్రిక్స్ సిస్టమ్స్‌లో సీనియర్ క్లౌడ్ ఇంజినీర్ మంజునాథరెడ్డి ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సిఐసిడి నిర్వహణలో ఆటోమేషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు ఓపెన్ సోర్స్ ఆటోమేషన్ సాధనమైన అన్సిబుల్‌ను పరిచయం చేసి, వాస్తవ ప్రపంచ దృశ్యాలను డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సిఎస్ఇ(ఎఐ) విభాగాధిపతి డాక్టర్ ఎం.రోషిణి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మయ్య, ఎఐడిఎస్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి వర్గీకరణపై అధ్యయనానికి నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను రాష్ట్ర క్యాబినెట్‌తో పాటు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం హర్షణీయమని ఎంఎస్‌పి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ తెలిపారు. ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం కె.వి.పల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ చిత్రపటానికి అభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 59 ఎస్‌సి ఉప కులాలకు వారి జనాభా ప్రాతిపదికన 15 శాతం రిజర్వేషన్‌ను న్యాయబద్ధంగా కేటాయించడాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రిజర్వేషన్ అమలుకు తాము మద్దతుగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ వర్గీకరణ వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవి పల్లి మండల ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి సందిపోగల రాము, ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి దొడ్డి వెంకటాచలపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

దళితుల హక్కుల కోసం ఉద్యమించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప పిలుపు

ప్రజాశక్తి- కడప అర్బన్

దళితుల హక్కుకై ఉద్యమించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప పిలుపునిచ్చారు శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా విస్తృత సమావేశం కడప ఆర్కే నగం లో నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. దళితుల ఓట్లు కావాలి, కానీ దళితుల హక్కులు మాత్రం కాలరాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. హత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్నటువంటి దళిత వర్గం ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సమావేశంలో జకరయ్య, మనోహర్, జితేంద్ర, అన్వేష్, రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, రఘు, నాగేంద్ర, జార్జి, బాబు, డేవిడ్, నరసయ్య, రవి, వెంకటేశు, రాయప్ప నరసింహ, మహేష్, జయరాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘానికి నామినేషన్ల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రాయచోటి బార్ అసోసియేషన్ 2025 - 26 సంవత్సరానికి ఈనెల 29న నిర్వహించబోయే ఎన్నికలకు గాను శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయినట్లు ఎన్నికల అధికారి కే.రాజ్ కుమార్ రాజు ప్రకటించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గంలో ఎన్నికల ద్వారా ఏడుగురిని ఎన్నుకోవాల్సి ఉండగా 17 మంది నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. అధ్యక్ష పదవికి ఎన్.ప్రభాకర్ రెడ్డి, వై రమేష్ రెడ్డి ఉపాధ్యక్ష పదవిక యు. ధనుంజయ్ కుమార్, టి.ఈశ్వర్, ఎం.ఎల్. రామచంద్రారెడ్డి, వై రామ్మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శికి పి.రెడ్డిబాష, పి.శ్రీనివాసులు సహాయ కార్యదర్శులుగా డి.నాగముని, ఎం.ఎం. వి రమణ, రామ్‌కుమార్ ట్రెజరర్‌గా ఆదిరెడ్డి నాయక్ నాగరాజా స్పోర్ట్స్ సెక్రటరీగా వి సిద్దయ్య, కె.బాలచంద్ర లైబ్రరీ సెక్రెటరీగా టి.వి. రమణ, డి. రామకుమార్ నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న న్యాయవాదులు

బెట్టింగ్ జోలికెళ్లొద్దు : సిఐ

మాట్లాడుతున్న సిఐ ప్రసాద్ బాబు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : ఐపిఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కావడంతో కొంతమంది బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం సిఐ ప్రసాద్ బాబు హెచ్చరించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్‌ను చూసి, ఆడి ఆస్వాదిస్తూ అనుభూతి చెందాలే తప్ప బెట్టింగ్స్ వేయడం నేరమన్నారు. బెట్టింగ్స్ వేసి అప్పుల పాలు కావడంతో వారినే నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంటుందన్నారు. బెట్టింగ్స్‌కు పాల్పడే వ్యక్తులు ముందుగా వారి కుటుంబాన్ని గుర్తు చేసుకొని, బెట్టింగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మ్యాచ్‌లు చూసి ఆనందపడాలే గానీ బెట్టింగ్స్ వేసి పట్టుబడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని ప్రయివేట్ పరం చేస్తే పోరాటాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రభుత్వం పి4 పద్ధతిలో మెడికల్ కళాశాలలు మారుస్తున్నామని, అందులో భాగంగానే మదనపల్లి ప్రభుత్వ అసుపత్రిని కూడా కార్పొరేట్ కంపెనీలకి అప్పగించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సిపిఐ నాయకులు కృష్ణప్ప, సాంబ శివ, మురళి ఆరోపించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిని ప్రయివేట్ యాజమాన్యానికి అప్పగించడం కోసం ఆస్పత్రిలో వైద్యాన్ని బలహీన పరుస్తూ 70 మంది ఉన్న డాక్టర్లని 14 మందికి తగ్గించారన్నారు. ఉన్న డాక్టర్లకు కూడా బదిలీలు రెడీగా ఉన్నాయని, బడ్జెట్లో నిధులు తగ్గించడం వల్ల, ఆసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మాత్రం ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వంలోనే కొనసాగిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా అ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం ఆలోచనలు మార్చుకొని ఆసుపత్రిని ప్రభుత్వంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు మండల తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తహశీల్దారు భీమేశ్వరరావు ఆహ్వానించి, వారితోపాటు తాను కూడా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని, భక్తిశ్రద్ధలతో వారు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరిస్తారన్నారు. ఈ మాసంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, సద్భావనతో కుల మతాలకతీతంగా అందరూ కలిసి రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. తహశీల్దారు కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేసే ముస్లిం సోదరులతో పాటుగా తెలుగు వారికి కూడా ఇఫ్తార్ విందు ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో స్థిమితమైన మనసుతో భగవంతుని ప్రార్థిస్తే ఆ కుటుంబానికి భగవంతుడు ఎల్లవేళలా తోడుగా ఉంటాడన్నది అందరిని విశ్వాసమన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది

బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాత తండ్రి, ఉపాధ్యాయులు

విద్యార్థులు నచ్చిన రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-పీలేరు : పిల్లలు విద్యతో పాటు తమకు నచ్చిన రంగాల్లో రాణించినప్పుడే తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు సాధ్యమని శివరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి తెలిపారు. అమెరికాలో నివాసం ఉంటున్న పీలేరు వాసి సుమలత తన సొంత ఊరిపై మమకారంతో శనివారం పీలేరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి, వారికి బహుమతులను తన తండ్రి, పీలేరు సొసైటీ బ్యాంక్ అప్రైజరైన రాజేంద్రాచారి ద్వారా ప్రధానం చేయించారు. ఈ కార్యక్రమాలను పీలేరు మండలం, రేగళ్ళ పంచాయతీ, శెట్టిపల్లి, దొడ్డిపల్లి పంచాయతి, శివరామపురం, పీలేరు టౌన్ లోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అభివ ృద్ధి కావాలని కోరుకుంటూ వారికి ఆశీస్సులు తెలియజేశారు. శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాచపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తన తండ్రి రాజేంద్రాచారి, హెచ్‌ఎం శోభారాణిల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

లక్ష్య సాధన కోసం చదవాలి : 'సుగవాసి'

ప్రజాశక్తి- రాయచోటి : ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగువాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణం మాసాపేట ఎస్ఎన్ఎస్ రైస్ మిల్‌లో విశ్వభారతి ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసాపేటలో విశ్వభారతి స్కూల్ యాజమాన్యం అతితక్కువ ఫీజులు తీసుకుంటూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం పట్టుదల క్రమశిక్షణతో చదవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను అవగాహన చేసుకుని చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యం గల విద్యను అభ్యసించి తమకు తాము భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్కూల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ప్రసాద్ బాబును స్కూల్ యాజమాన్యం సుగవాసి మురళీ శాలువ కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో కదిరి ఉదయ్ భాస్కర్, సుగవాసి జానకిరామ్, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రసాద్‌బాబు

కుక్కల దాడిలో గాయపడిన జింక

జింకపై కుక్కలు దాడి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని బాహుదానది సమీపంలోని నేషనల్ హైవే బైపాస్ రోడ్డు ప్రక్కన ఉన్న వరి పంట పొలాల్లో ఒక జింకను కొన్ని కుక్కలు వెంటపడి దాడి చేసి గాయపరిచాయి. గమనించిన కొందరు యువకులు ఆ జింకను కాపాడి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కుక్కల దాడి నుంచి జింకను రక్షించిన గొల్లపల్లె కు చెందిన బడే, తిమ్మయ్య, పవన్‌కుమార్, కొండయ్య ,నందకుమార్, శమీ ఉల్లాలను స్థానికులు అభినందించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రామాపురం

ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వి. సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ ఆదేశాలతో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. రామాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారాలను పసిగట్టేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు తెలిపారు. అన్ని గ్రామాలు, ప్రాంతాలలో సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారాలను గమనిస్తూ ఉంటారని తెలిపారు.బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రత్యేక బృందంతో పాటు తాను, తమ సిబ్బందితో కూడా నిరంతరం కేఫ్, టీ పాయింట్లు హోటళ్లలో కూడా క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారికోసం నిఘా ఉంచుతామన్నారు. పిల్లల ప్రవర్తన, తమ ఆర్థిక లావాదేవీలపై పెద్దలు దృష్టిపెట్టాలని తెలిపారు. **లక్కిరెడ్డిపల్లె :** క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ ల బెట్టింగ్ లపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి చాలా మంది యువత చెడిపోతున్నారని, బెట్టింగ్ వ్యసనం నేరమని అన్నారు. ఎవరైన బెట్టింగ్ పాల్పడినట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

2025-26 సంవత్సరానికి గాను ఎస్‌టి గురుకుల పాఠశాలలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐటిడిఎ గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రాయచోటి, కెవిపల్లి, పీలేరులోని ఎస్‌టి గురుకుల పాఠశాలలలో ప్రవేశాల కొరకు 5,6,7,8 తరగతి వారికి పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. అందులో అర్హత కలిగిన విద్యార్థులను మాత్రమే అడ్మిషన్లు చేసుకుంటామని తెలిపారు. ఏపి ట్రైబల్ వెల్ఫేర్ రాయచోటిలో 5తరగతికి 80 సీట్లు ,6తరగతికి 39 సీట్లు,7వ తరగతి6 సీట్లు ఉన్నాయని తెలిపారు. కె.వి.పల్లి ఎస్‌టి గురుకులంలో పీలేరు గురుకుల పాఠశాలలో 5 తరగతికి 80, 6తరగతికి 64, ఏడవ తరగతికి 55, ఎనిమిదో తరగతికి 46,9వ తరగతి 46 సీట్లు ఉన్నాయని వారు తెలిపారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాల కొరకు 9441146908, 7382264994 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

కలకడ కస్తూర్బాలో..

కలకడ : మండల కేంద్రమైన కలకడ కస్తూర్బా గాంధీ బాలిక గురుకుల పాఠశాలలో చేరు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనిత పేర్కొన్నారు. మండలంలో 5వ తరగతి నుండి చదివి ఆరవ తరగతిలో చేరుటకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 2025-26 సంవత్సరానికి గాను ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చేరు విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలిక గురుకుల పాఠశాలలో చేరు విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మండలంలో బడి బయట ఉన్న విద్యార్థులు, బడి మానివేసిన విద్యార్థులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన నిరుపేద విద్యార్థుల నుంచి దరఖాస్తు కోరడం జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తంబళ్లపల్లి కెజిబివిలో..

తంబళ్లపల్లె : మండల పరిధిలోని కెజిబివిలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 8వ తరగతుల్లో మిగిలిన సీట్లకు, ఇంటర్ బైపిసి గ్రూపుకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ సుమతి పేర్కొన్నారు. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్, పేద, ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను https://apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా పొందగలరని తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

నీటి విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి

మదనపల్లి : నీటి ప్రాముఖ్యత గురించి చిత్రాలను ప్రదర్శిస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

రాజంపేట : పారంపాండ్స్ పనులను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కళాశాల ఎన్‌సిసి లెఫ్ట్ నెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతిఒక్కరు నీటి విలువను గుర్తించి పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం మార్చి22న ప్రపంచ జల దినోత్సవం, మంచినీటి ప్రాముఖ్యతను గుర్తించడానికి ఒక సందర్భమని అన్నారు. మానవ చరిత్ర మొత్తం జలవనరులతోనే ముడిపడి ఉందని, జీవం నీటితో మొదలైంది, ప్రకృతి నీటితోనే నడుస్తోందన్నారు. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలి. జీవవైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సాగునీటి ఎద్దటి నివారణ కోసం చేపట్టిన సేద్యపు కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, నీటి వనరుల సంరక్షణకు అందరం కలిసికట్టుగా పాటు పడదామని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఊటుకూరు గ్రామపంచాయతీ నందు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతు రాయ పరాజు పెంచల్‌రాజు పొలంలో నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వ అధికారులు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎపిఓసాలయ్య, జెఇ మీనా కుమారి, టిఎశోభ, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, కొండా శ్రీనివాసులు, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, ప్రతినిధి జగదాభి పాండురాజు, ఊటుకూరు సర్పంచ్ ఈశ్వరయ్య పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని కేసాపురం గ్రామం ముండ్లవారికోటలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సేద్యపు నీటి కుంటలు, పారంఫాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కె.విశ్వనాథరెడ్డి పొలంలో పారంపాండ్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నీటి వినియోగం పెరుగుతూ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం ఎంపీడీవో శేఖర్ నాయక్ మరియు టెక్నికల్ అసిస్టెంట్లు రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** భూగర్భ జలాలను పెంపొందించి, కరువును నివారించడానికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేక చర్యలను చేపడుతున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. ప్రపంచ జల వనరుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి పంచాయతీలోనూ స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి రైతుల పొలాలలో పారంపాండ్లను నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షులు పుర్ర వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, జనసేన మండలాధ్యక్షులు ప్రదీప్‌సింగ్, సర్పంచులు పాపులమ్మ మల్లప్ప, సుబ్రమణ్యం, శ్రీవాణి నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంలో అనుసంధానించడంలో భాగంగా భూగర్భ జలాలను పెంపొందించడానికి, కరువును నివారించడానికి రైతుల పొలాలలోకి పారం పాండ్లను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమ పొలాల వద్ద నీటి కుంటలను ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీటిని ఒడిసి పట్టడంతో పొలాలకు నీరు అందడమే కాకుండా, నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల నీటిమట్టం పెంపొందించవచ్చునని అన్నారుఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4000 కిలోమీటర్లకు పైగా సిసి రోడ్లు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్ రావు, మల్లికార్జున, మాజీ జెడ్పిటిసి సుజాత, రెడ్డప్ప, ఎటిఎలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : పారంపాండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎపిఒ

పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

- ముగిసిన పోషణ్‌భీ పఢైభీ శిక్షణ

గాలివీడు : అంగన్వాడీలకు అవగాహన కల్పిస్తున్న పద్మావతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

పిల్లలలో పూర్వ ప్రాథమిక విద్యలో నైపుణ్యాలు పెంపు లక్ష్యంగా ప్రీ ప్రైమరీ టీచర్లు పనిచేయాలని ఐసిడి ఎస్ సూపర్‌వైజర్ దాద్‌బీ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పఢైభీ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఐదు రకాల అభివృద్ధిల గురించి శారీరక అభివృద్ధి, మేధోభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక భావోద్వేగా భివృద్ధి, సంస్కృతిక , కళాత్మక అభివృద్ధి గురించి అంగన్వాడీ కార్యకర్తలకు నైపుణ్యాల గురించి శిక్షణ కార్యక్ర మం నిర్వహించినట్లు తెలిపారు. నవచేతన, ఆదర్శిలా విద్యా విధానం గురించి పిల్లలలో తగిన పురోగతిలో కీలక సామర్థ్యాలను నేర్చుకోవడం పై దృష్టి సాధించడం, వివరణాత్మక రోజువారి వారపు పాఠ్యప్రణాళికను గురించి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని జడ్‌పి హైస్కూల్‌లో పోషణ్‌భీ పఢైభీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు విజయవం తంగా ముగిశాయని రైల్వే కోడూరు సిడిపిఒ సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. అంగ న్వాడీ వ్యవస్థ ద్వారా ఇటు చిన్నారుల్లోనూ అటు గర్భిణుల్లోనూ పోషకాలతో కూడిన ఆహారంతో పాటు వారి జీవన విధానం లో మార్పులను తీసుకొచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టిం దని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు మణెమ్మ, నిర్మలాదేవి, జయ లక్ష్మమ్మ, రత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురం : మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం మూడవ రోజుతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతుల్లో గర్భిణులు, బాలింతలు పిల్లల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు కలిగిన ఆహారంతో పాటు 0 నుంచి 3లోపు పిల్లలకు పిల్లలకు అందించిన నవచేతన్ 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు అందించవలసిన విద్యా ఆధార్, బాలింతలలో రక్తహీనత, పిల్లలలో ఎత్తుకు తగ్గట్టు బరువు తక్కువ ఉన్న వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.గ్రోత్ మానిటరింగ్ తదితర అంశా లు శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న ఐదు అంశాలను అంగన్వాడీ కేంద్రాలలో అమలుపరిచి మహిళా శిశు సంక్షేమ శాఖకు మంచి పేరు తేవాలన్నారు. శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మజ, రాణి, హుస్సేనమ్మ, సుజాతరెడ్డి వ్యవహరించారు. **గాలివీడు :** స్థానిక ఎంపిడిఒ సభాభవంలో అంగన్వాడీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ పీడీ వై.పద్మావతి పోషణ్‌భీ పఢైభీ లక్ష్యం గురించి అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమములో 5 డొమైన్ల గురించి అవగా హన కల్పిం చినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్ర మంలో సూపర్‌వైజర్లు తులసమ్మ, సోని, అరుణకుమారి, ఓబులమ్మ, లక్ష్మి, కుమారి, పరజాతమ్మ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** అంగన్వాడీలో విద్య నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం పోషణ్‌భీ పఢైభీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిందని సిడిపిఇఒ నాగవేణి అన్నారు.గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు రెండు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి.పిల్లలు ఆకర్షించేలా ఆటపాటలతో కూడిన విద్యానందించడం, పోషకార ప్రాధాన్యతను వివరించడం, తల్లిదండ్రులను కూడా భాగస్వామిలు చేయడంపై శిక్షణ నిర్వహించారు.

పుల్లంపేట : పోషణ్‌భీ పఢైభీ శిక్షణకు హాజరైన అంగన్వాడీ కార్యకర్తలు

గ్రామ పంచాయితి కార్యాలయము, కలకడ

రి.క.నెం.03/2025 తేది:21-03-2025

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! కలకడ గ్రామ పంచాయితీకి చెందిన 1) వారపు కూరగాయల సంత 2) బస్టాండు గేటు (ఆర్.టి.సి. మినహా) 3) దినసరి మార్కెట్ (టమోటా) వారపు సంత రోజు మినహా 4) జంతు వధశాల 5) గ్రామ పంచాయతి షాపింగ్ రూములు వసూళ్ళు చేసుకొను హక్కులకు 2025-2026 వ సంవత్సరమునకు (అనగా 01.04.2025 నుండి 31.03.2026 వరకు) తేది. 27.03.2025 గురువారము మధ్యాహ్నం 2.00 గంటలకు గ్రామ సచివాలయము, కలకడ యందు బహిరంగ వేలము వేయబడును. వేలముల యందు పాల్గొనువారు వేలము నోటిఫికేషన్ నిబంధనలకు లోబడి క్రింద కనిన గుత్తలు వాటికి ఎదురుగా కనిన డిపాజిట్లు పంచాయతి కార్యదర్శి, గ్రామ పంచాయతి, కలకడ వారికి వేలమునకు ముందు నగదు పంచాయతి కార్యదర్శి, గ్రామ పంచాయతి, కలకడ వారికి డిపాజిట్లు చెల్లించి సాల్వెన్సీ సమర్పించవలెను.

వ.నెం	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు	సాల్వెన్సీ ధృవపత్రము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన ధరావత్తు
01.	వారపు కూరగాయల సంత	రూ.5,00,000/-	రూ.5,00,000/-	రూ.10,00,000/-
02.	బస్టాండు గేటు (ఆర్.టి.సి. మినహా)	రూ.1,50,000/-	రూ.1,50,000/-	రూ.3,00,000/-
03.	దినసరి మార్కెట్ (టమోటా) వారపు సంత రోజు మినహా	రూ.5,00,000/-	రూ.5,00,000/-	రూ.10,00,000/-
04.	జంతు వధశాల	రూ.2,000/-	రూ.2,000/-	రూ.4,000/-
05.	గ్రామ పంచాయితి షాపింగ్ రూములు 1,2 మరియు 3 గదులు	రూ.1,00,000/-	రూ.1,00,000/-	రూ.2,00,000/-

షరతులు : 1). వేలములో పాల్గొనువారు పంచాయతికి ఎలాంటి పన్నులు, కిస్తులు బాకీలు మరియు లీజు మొత్తములు బాకీవుండరాదు. 2) వేలము నందు షెడ్యూలులో కనిన మేరకు డిపాజిట్లు మరియు సాల్వెన్సీ హాజరు పరచినవారు మాత్రమే పాల్గొనవలెను. 3) వేలములో పాల్గొనువారు తమకు సంబంధించిన ఇంటిపన్ను రశీదు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను మరియు ఫొటో సమర్పించి సదరు బహిరంగ వేలములో పాల్గొనవలెను మరియు తదుపరి నోటిఫికేషన్ నిబంధనల మేరకు వేలము నిర్వహించబడును. 4) ఏకారణము తెలుపకనే వేలము పాటను నిలుపుదల చేయుట, వాయిదా వేయుటక్ను మరియు రద్దు పరచుటకున్ను పంచాయతి కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు. 5) వేలము పాట ముగిసిన వారము రోజుల లోపుగా హెచ్చుపాటదారు వేలము మొత్తమును ఒకే దఫా చెల్లించవలెను. అట్లు గడువులోపల సదరు మొత్తమును చెల్లించని ఉతిడల సదరు వేలమునకు హెచ్చుపాటదారు చెల్లించిన వేలము డిపాజిట్టును గ్రామ పంచాయతి నిధికి దండుగ క్రింద జమ కట్టుకొని రెండవ హెచ్చుపాటదారునికి అవకాశము కల్పించబడును. లేదా పంచాయతి కార్యదర్శి వారు సదరు వేలము పాటను రద్దు చేయుటకు అధికారము కలదు. 6) సదరు హెచ్చుపాటదారులు హెచ్చుపాటకు 3 శాతం స్టాంప్ - డ్యూటీ, హెచ్చుపాట ముగిసిన వెంటనే పంచాయతికి చెల్లించవలెను. 7) సదరు హెచ్చుపాటదారులు తమ స్వంత ఖర్చులతో రూ.100 స్టాంపు పేపరుపై అగ్రిమెంట్లు వ్రాసి ఇవ్వవలెను.

సం//కె. దేవేంద్ర, పంచాయితీ కార్యదర్శి, కలకడ గ్రామ పంచాయితీ, కలకడ మండలం
సం//యం.మహమ్మద్ రియాజుద్దీన్, విస్తరణాధికారి(పి.ఆర్. &ఆర్.డి), కలకడ మండలం, అన్నమయ్య జిల్లా
సం// శ్రీ కె. నాగరాజ, డివిజన్ పంచాయతి అధికారి, మదనపల్లి
శ్రీమతి టి. ప్యారిజాన్, సర్పంచ్, కలకడ గ్రామ పంచాయితీ, అన్నమయ్య జిల్లా

టిడిపి బలోపేతానికి కృషి

-తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పెద్దతిప్ప సముద్రం మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 60 ఓట్ల రేంజ్‌కు కుటుంబ సాధికార సారథులు ఒక పురుషుడు, ఒక మహిళ నియమించుకోవాలన్నారు. మహిళలు లేని చోట మాత్రమే మగవారికి అవకాశం కలుగు తుందని తెలిపారు.రాష్ట్ర కమిటీ, పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ కమిటీ, మండల కమిటీ, గ్రామ కమిటీలలోగానీ క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జి ఉండాలన్నారు. సీరియల్ నెంబర్ వారధిగా ప్రతి 60 ఓట్లకు ఒక కుటుంబ సాధికార సార థులు ఉండాలని తెలి పారు. సమావేశంలో తంబళ్ల పల్లె నియోజకవర్గ సమన వ్యయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, నాయకులు కట్టా సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం

ప్రజాశక్తి-రామసముద్రం : మండల పరిధి లోని చెంబ కూరు గ్రామం లో శని వారం ఉరు ములు, మెరు పులతో కూడిన వర్షం కురి సింది. ఈ సమ యంలో కొతూరు గ్రామానికి వెళ్లే మార్గంలో దారి ప్రక్కన కొబ్బరి చెట్టు పై పిడుగు పడి మం టలు చెలరే గాయి. ఈ ఘటనలో ఎటు వంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇళ్ల ఆవాసాల మధ్య పిడు గు పడటంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. పిడు గు పడిన ప్రాంతానికి కూత వేటు దూరంలో గత 20 ఏళ్ల క్రితం చింత చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు క్రింద ఉన్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పిడుగుపాటుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు

పిడుగు పాటుతో కాలిపోతున్న కొబ్బరి చెట్టు

పొలంలో ఫారం పాండ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి-పీలేరు : ఉపాధి హామీ పథకంలో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో ఫారం పాండ్లను ఏర్పాటు చేసుకోవాలని ఎపిఒ అశోక్ రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు మండల పరిధిలోని గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 42 ఫారం పాండ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మండలంలో జూన్ నెల చివరినాటికి 250 ఫారం పాండ్ల పనులు పూర్తి చేయాలాన్నది తమ లక్ష్యమన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నంపల్లి పంచాయతీ లింగిరెడ్డిపల్లి దళితవాడలో రూ. 10లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణాన్ని కూడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సాయివికాస్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సాయివికాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడుతున్నాయనిచ ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.నియోజకవర్గం లోని ప్రతి మారుమూల గ్రామానికి కూడా సిమెంటు రోడ్డును వేయించడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే మాటల్లో చెప్పడం కాదని చేసి చూపించడమే అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. వేసవి కాలంలో ప్రతి గ్రామంలోనూ నీరు పుష్కలంగా ఉండాలని, నీటి కొరత ఉన్న గ్రామాల ప్రజలు తమను సంప్రదిస్తే వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు జ్ఞానపీఠ్ అవార్డు హర్షణీయం

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రముఖ హిందీ రచయిత, నవలాకారుడు వినోద్‌కుమార్ శుక్లాకు 2025 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వ జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఆయన 50 సంవత్సరాల పాటు హిందీ సాహిత్యానికి సేవలందించారని అన్నారు. 1979లో ఆయన రచించిన నౌకర్ కి కమీజ్ అనే నవలకు కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి జ్ఞానపీఠ అవార్డు ప్రకటించిందని అన్నారు. గతంలో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు కూడా అందుకున్నారని తెలిపారు.

బౌలర్ ఆఫ్ ది ఇయర్‌గా మసూద్

ప్రజాశక్తి కలికిరి

కలికిరి ప్రాంతానికి చెందిన మసూద్ క్రిక్ హీరోస్ క్రికెట్ సంస్థలో బౌలింగ్ విభాగంలో ఇండియాలో రెండవ స్థానానికి రన్నర్‌గా నిలిచినట్లు వారు తెలిపారు. ఎడమచేతి వాటం బౌలర్ అయిన మాసూద్ 2024లో 464 వికెట్లు సాధించి ఈ ఘనతను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలికిరికి చెందిన క్రీడాకారులు అందరూ అభినందించారు. భారతదేశంలో కొన్ని లక్షల మంది క్రిక్ హీరోస్ సంస్థ యాప్ ద్వారా ఆన్‌లైన్ స్కోర్ వేసి క్రికెట్ ఆడుతుంటారని ఈ ఘనత సాధించడం మామూలు విషయం కాదని వారు ఆనందం వ్యక్తం చేశారు. క్రిక్ హీరోస్ సంస్థ యాప్ వారు బహుమతిగా సర్టిఫికెట్, టీ షర్ట్, గోల్డ్ కలర్ మెడల్, అ యాప్ లోగో తో కూడిన ఒక క్యాప్ పంపారని ఆయన తెలిపారు. ఆ సంస్థ నిర్వాహకులు ప్రతి సంవత్సరం బ్యాటింగ్‌లో ఎక్కువ పరుగులు, బౌలింగ్ లో ఎక్కువ వికెట్స్ తీసిన వారిని ఎంపిక చేసి విన్నర్స్, రన్నర్స్‌ను ప్రకటిస్తారని చెప్పారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బి.కొత్తకోట మండలం, కాండ్లమడుగు క్రాస్ వద్ద అనాథ వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఆ వృద్ధుడు అక్కడిక్కడే మృతుడి చెందాడు. మృతుడి వివరాల కోసంపోలీసులు విచారించిన లభ్యం కాలేదు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. కుటుంబ సభ్యులు, బందువులు ఎవరూ రాకపోవడంతో హెల్పింగ్ మైండ్స్ బృందానికి సమాచారం అందించారు.హెల్పింగ్ మైండ్స్ సభ్యులు శనివారం అనాథ వృద్ధుడ్డికి దహన సంస్కారాలను హిందూ శ్మశాన వాటికలో నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ ఎవరు లేని అనాథలకు తమ సంస్థ ముందుకు వారి మృతదేహాలను వారివారి మత సాంప్రదాయ బద్ధంగా తమ సంస్థ సభ్యుల సహకారంతో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో 917 కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు,వందలాది అనాథ మృతదేహాల అంత్యక్రియలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట పోలీస్ శాఖ సిబ్బంది రామాంజులు,యుగంధర్, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు జాఫర్, కిరణ్, చైతు, సాంబ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

క్షణికావేశంలో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్షణికావేశంలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు. వలసపల్లె గ్రామం, దిగువ కృష్ణాపురానికి చెందిన గణేష్‌బాబు టెంపో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య లత(38) కూలీ పనులకు వెళ్లేది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు రెండేళ్ల క్రితం పెళ్లి చేశారు. రెండో కుమార్తె డిగ్రీ చదువుతోంది. వీరి సంసారం సజావుగా సాగిపోతోంది. ఇటీవల లత చెల్లెలు చనిపోవడంతో ఆమె కుమార్తె ఒంటరిగా ఉంటోంది. ఆ పాపను మన వద్దకే పెట్టుకుందామని, తీసుకురమ్మని భర్తకు చెప్పింది. వీలు చూసుకుని తీసుకవస్తానని భర్త చెప్పడంతో క్షణికావేశానికి లోనైన లత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న మదనపల్లె తాలూకా పోలీ సులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్ పేలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అంగళ్లుకు చెందిన కృష్ణయ్య స్థానికంగా ఓ టీ దుకాణం నిర్వహించుకుంటూ జీవనం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం టీ దుకాణం నడుపుకుంటున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో టీ కొట్టులో కృష్ణయ్య ఒకడే ఉండడంతో మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపు చేసి తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై ముదివేడు పోలీసులు విచారణ చేపట్టారు.

మంటల్లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ. బిసి కాలనీలో నివాసమున్న గంప చిన్న సుబ్బయ్య(55) మద్యం మత్తులో మంటలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. నల్లగుట్టపల్లె పంచాయతీ బిసి కాలనీ చెందిన గంప చిన్నసుబ్బయ్య శుక్రవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి గట్టుకు నిప్పిపెట్టి నిప్పులో పడి మృతి చెందాడని తెలిపారు. రాత్రికి తన భర్త ఇంటికి రాకపోవడంతో మృతుడి భార్య సుబ్బమ్మ ఇంటి పక్కన వారిని అడిగిందని తెలిపారు. మరుసటి రోజు ఉదయం శనివారం ఆ గ్రామంలోని గొర్ల కాపరులు గొర్రెలను మేపుకొనుటకు వెళ్లి చూడగా గమనించి సమాచారం అందించారని తెలిపారు. వెంటనే పొలం గట్టు వద్దకు వెళ్లి చూడగా తన భర్త నిప్పులో పడి మృతి చెందినట్లు గుర్తించారని అన్నారు. తన భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి..

ప్రజాశక్తి-కలకడ

ఈతకెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు..మండలంలోని బాలయ్యగారి పల్లి పంచాయతీ సత్యవతినది అనుసంధానంగా ఉన్న జరిలో,సంబేపల్లి మండలం గుట్టపల్లి సమీపంలో ఉన్న మాదిగి పల్లికి చెందిన అనిల్ కుమార్(20) తమ గ్రామానికి చెందిన మరి కొంతమందితో జరిలో ఈతకు వెళ్ళాడని చెప్పారు. ఈత ఆడుతున్న క్రమంలో అనిల్ ఊపిరాడక నీళ్లలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు సంబేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన కలకడ మండలంలో జరిగినందున కలకడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయమని సూచించారు. మృతుడు అనిల్ మృతదేహాన్ని కలకడకు తీసుకువచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.